www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 10-6-2024 | పేజీలు: 10+8 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 55 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: చవితి సా. 4.15 తదుపరి పంచమి; నక్షత్రం: పుష్యమి రా. 9.40 తదుపరి ఆశ్లేష; వర్జ్యం: తె.ఉ.6.28; దుర్ముహూర్తం: మ.12.40-1.32, మ.3.16-4.09; అమృతఘడియలు: మ.2.54-4.36; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 5.44; సూర్యాస్తమయం: 6.45 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

జంట హత్యలపై సమగ్ర విచారణ జరిపించాలి

- హత్యల వెనుక నయీమ్ ముఠా ఆనవాళ్లు
- పక్కాప్లాన్ ప్రకారం హత్యలు
- వాట్సాప్ కోణం కాకుండా రాజకీయ కోణం ఉన్నట్లు అనుమానం
- బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

- పూర్తి వివరాలు 4లో

నేటినుంచి యథావిధిగా ప్రజావాణి : కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, జూన్ 9 : ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతీ సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని నేటి నుంచి యథావిధిగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ శశాంక తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అములో ఉండటం వల్ల ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేశామన్నారు. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ముగిసినందున ఈ కార్యక్రమాన్ని తిరిగి కొనసాగనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

సాగు బాట

వానాకాలం సాగుకు రైతుల ఏర్పాట్లు

ఆశాజనకంగా నైరుతి రుతుపవనాలు

వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన కర్షకులు

జిల్లాలో ఖరీఫ్‌సాగు జోరందుకుంది. సకాలంలో నైరుతి రుతుపవనాల రాకతో ఈ యేడు సాగుబడి ఆశాజనకంగా ఉంది. తొలకరి పలకరింపుతో నేలతల్లి పులకరిస్తోంది. ఇటీవలి వర్షాలకు అన్నదాతలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమై బిజీగా గడుపుతున్నారు. వ్యవసాయ పరికరాలు సమకూర్చుకోవడంపై దృష్టి సారించారు. దుక్కులు దున్నుకోవడం, విత్తనాలు, ఎరువుల కొనుగోలు, నారుమడుల ఏర్పాటు తదితర పనులపై నిమగ్నమయ్యారు.



శంకర్‌పల్లిలో కొత్తగా బోరు వేయించుకుంటున్న రైతు



ట్రాక్టర్ నాగళ్లకు మరమ్మతు చేయిస్తున్న రైతులు



అమనగల్లులో దుక్కులు దున్నుతున్న రైతులు



చేవెళ్లలో విత్తనాలు కొనుగోలు చేస్తున్న రైతులు



మంచాలలో పత్తి విత్తనాలు విత్తుతున్న కూలీలు



యాచారంలో మోటారుకు మరమ్మతు చేస్తున్న మెకానిక్

ప్రశాంతంగా ముగిసిన

గ్రూప్-1 పరీక్ష

- 75.01శాతం మంది అభ్యర్థులు హాజరు
- ఆలస్యంగా వెళ్లిన అభ్యర్థులకు నో ఎంట్రీ
- పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, భూపాల్‌రెడ్డి
- నిబంధనల అములుపై నిశిత పరిశీలన



ఇబ్రహీంపట్నంలో ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను నిలిపివేసిన అధికారులు

రంగారెడ్డి అర్బన్, జూన్ 9 : జిల్లాలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాతంగా ముగిసింది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-1 పరీక్ష ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రారంభమై ఒంటి గంటకు ముగిసింది. కొన్నిచోట్ల ఆలస్యంగా పరీక్షా కేంద్రాలకు చేరుకున్న అభ్యర్థులను అధికారులు అనుమతించకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. ఇబ్రహీంపట్నంలోని సెయింట్ ఇంజనీరింగ్ కళాశాల సెంటర్ వద్ద ఉదయం 10 గంలకు గేట్ క్లోజ్ చేశారు. ఆలస్యంగా వచ్చిన ఆరుగురు అభ్యర్థులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌ను వేడుకున్నా లోపలికి అనుమతించలేదు. దీంతో పలువురు మహిళా అభ్యర్థులు కంటతడి పెట్టారు. మొయినాబాద్ మండలంలో 8 మంది 4 నిమిషాలు ఆలస్యంగా రావడంతో అనుమతించలేదు. దీంతో మొత్తం జిల్లాలో 14 మంది అభ్యర్థులు తిరిగి ఇంటి బాట పట్టారు. ఎగ్జామ్ సెంటర్‌లోకి పంపే ముందు హాల్ టికెట్, అభ్యర్థుల ఐడీ కార్డులను నిశితంగా పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా 93 పరీక్ష కేంద్రాల్లో 55,692 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 41,774 మంది పరీక్షలకు హాజరయ్యారు. 75.01శాతం హాజరు శాతం నమోదైంది. పోలీసు స్టేషన్లలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద నుంచి భారీ బందోబస్తు మధ్య రూట్లవారీగా ప్రశ్నపత్రాలు, ఇతర సామగ్రిని పరీక్షా కేంద్రాలకు తరలించారు. పరీక్ష ముగిసిన అనంతరం అభ్యర్థుల ఓఎంఆర్ షీట్లు, ఇతర మెటీరియల్‌ను నిబంధనలకు అనుగుణంగా సీల్‌వేసి, పోలీస్ ఎస్కార్ట్ నడుమ తిరిగి స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. ఈ ప్రక్రియను అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, భూపాల్‌రెడ్డిలు దగ్గరుండి చూసుకున్నారు.

పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ శశాంక

గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షా కేంద్రాలను కలెక్టర్ శశాంక ఆకస్మికంగా తనిఖీ చేశారు. అబ్దుల్లాపూర్‌మెట్‌లోని సెంటర్‌లో అభ్యర్థుల హాజరు, సిబ్బంది హాజరు గురించి అడిగి తెలుసుకున్నారు. నిబంధనలకు అనుగుణంగానే నిర్ణీత సమయంలో ప్రశ్నపత్రాలను తెరిచారా? లేదా? అన్నది నిర్ధారణ చేసుకున్నారు. బయోమెట్రిక్ హాజరు సేకరణ కోసం ప్రత్యేకంగా నియమించబడిన ఇన్విజిలేటర్‌లతో, బయోమెట్రిక్ సేకరణలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ ఆయా పరీక్షా కేంద్రాల్లోని గదులను సందర్శిస్తూ అభ్యర్థులకు అందుబాటులో ఉంచిన సదుపాయాలను గమనించి ముఖ్య పర్యవేక్షకులకు పలు సూచనలు చేశారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్దేశించిన నిబంధనలను తప్పకుండా అములు చేస్తూ ప్రశాంత వాతావరణంలో సాఫీగా పరీక్ష జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్‌లోని సంజయ్ గాంధీ మెమోరియల్ పాలిటెక్నిక్ కళాశాల, బాలాపూర్‌లోని తీగల కృష్ణారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలను సందర్శించి పరీక్ష నిర్వహణను పరిశీలించారు. అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, భూపాల్‌రెడ్డి మొయినాబాద్, ఇబ్రహీంపట్నంలోని పరీక్ష సెంటర్లను తనిఖీ చేశారు.



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసి తిరిగి వస్తున్న కలెక్టర్ శశాంక

వీరిద్దరికే పొగ

రంగారెడ్డి, మేడ్చల్ కలెక్టర్ల బదిలీలకు ఒత్తిళ్లు



రంగారెడ్డి, మేడ్చల్ కలెక్టర్లు శశాంక, గౌతమ్



మరికొందరు తహసీల్దార్ల బదిలీలకు యత్నాలు

భూ వ్యవహారాల్లో మాట వినకపోవడమే కారణం

తెర వెనుక నుంచి కథ నడుపుతున్న బడా వ్యక్తులు

ఉమ్మడి జిల్లాలో తమ మాట వినని అధికారులను సాగనంపేందుకు రాజకీయ నేతలు తెరచాటుగా పావులు కదుపుతున్నారు. మరికొందరు బడా నేతలు శివార్లలోని కొన్ని భూముల వ్యవవహారాల్లో తమకు ఇద్దరు కలెక్టర్లు అనుకూలంగా వ్యవహరించడం లేదని గుర్రుగా ఉన్నారు. కీలకమైన రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో పాలన గుప్పెట్లో పెట్టుకునేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ ప్రభుత్వంలోని కొందరు పెద్దలతో పాటు గత ప్రభుత్వంలో చక్రం తిప్పిన వ్యక్తులు వీరి బదిలీకి తెర వెనుక తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. బడా నేతలు, వ్యాపారులు కొందరు మంత్రులను కలిసి కలెక్టర్లు శశాంక, గౌతమ్‌ల బదిలీల కోసం ఒత్తిళ్లు చేస్తున్నట్లు సమాచారం.



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి, జూన్ 9): ఎన్నికలు ముగియడంతో అధికారయంత్రాంగం పాలన వ్యవహారాలపై దృష్టిసారిస్తోంది. అయితే ఇదే సమయంలో కీలకమైన రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో పాలన గుప్పెట్లో పెట్టుకునేందుకు రాజకీయశక్తులు ఏకమవుతున్నాయి. తమ మాటవినని అధికారులను సాగనంపేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ముఖ్యంగా జిల్లా కలెక్టర్లతో పాటు కీలక పోస్టుల్లో ఉన్న రెవెన్యూ అధికారులను బదిలీ చేయనున్నట్లు తాజాగా ప్రచారం సాగుతోంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎన్నికల కమిషన్ ఆదేశానుసారంగా జరిగిన బదిలీల్లో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక, మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ ఇక్కడ నియమితులైన విషయం తెలిసిందే. వీరిద్దరి పనితీరు బాగానే ఉండడంతో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ తరువాత వీరిద్దరినీ కొనసాగించింది. అయితే భూవ్యవహారాలకు సంబంధించిన విషయాల్లో ఇద్దరు కలెక్టర్లు కొంత కఠినంగానే వ్యవహరిస్తున్నారు. దీంతో కొందరు పెద్దలకు వీరు కొరగాని కొయ్యగా మారారు. ఒకవైపు గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూకుంభకోణాలను తవ్వడమే కాకుండా మరో వైపు ఒత్తిళ్లకు తలొగ్గకుండా పనిచేసుకుంటూపోతున్నారు. గతంలో ధరణీ ముసుగులో జరిగిన అక్రమాలను కూడా వెలికి తీస్తున్నారు. దీంతో వీరిద్దరి వ్యవహారం కొందరికి నచ్చడం లేదు. శివార్లలో గతంలో జరిగిన ఓ భూకుంభకోణాన్ని వెలికితీస్తున్న అధికారులను కొన్నాళ్ల పాటు ఈ కేసు జోలికి వెళ్లొదంటూ ఓ ఆమాత్యుడి నుంచి గట్టిగా ఆదేశాలు వచ్చాయి. దీంతో ఈ కేసు వ్యవహారాన్ని కొన్నాళ్లుగా పక్కన పెట్టారు. మరో వైపు మరికొందరు బడా నేతలు శివార్లలోని కొన్ని భూముల వ్యవవహారాల్లో తమకు ఇద్దరు కలెక్టర్లు అనుకూలంగా వ్యవహరించడం లేదని గుర్రుగా ఉన్నారు. వీరంతా ఇప్పుడు ఇద్దరు కలెక్టర్ల బదిలీకి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. బడా నేతలు, వ్యాపారులు కొందరు మంత్రులను కలిసి మేడ్చల్, రంగారెడ్డిజిల్లా కలెక్టర్ల బదిలీల కోసం వత్తిళ్లు చేస్తున్నట్లు సమాచారం.



తహసీల్దార్ల బదిలీలకు పట్టు...

అలాగే ఇద్దరు కలెక్టర్లతోపాటు శివార్లలో కీలక రెవెన్యూ పోస్టుల్లో ఉన్న అధికారుల బదిలీల కోసం కూడా తెరచాటుగా పావులుకదుపుతున్నారు. ఈ ప్రభుత్వంలోని కొందరు పెద్దలతో పాటు గత ప్రభుత్వంలో చక్రం తిప్పిన వ్యక్తులు వీరి బదిలీకి తెర వెనుక తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. కొందరు మంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధుల సహకారంతో బదిలీలకు ప్రయత్నాలు చేస్తున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. వీరి స్థానంలో తమకు అనుకూలమైన అధికారులను తెచ్చుకునేయత్నాలు సాగుతున్నాయి. కలెక్టర్లతో పాటు శివార్లలోని పని చేస్తున్న ముగ్గురు తహసీల్దార్ల బదిలీలకు కొందరు పట్టుబడుతున్నారు. రాజకీయ, వ్యాపారుల వత్తిళ్లకు ప్రభుత్వం తలొగ్గితే రేపో మాపో వీరి బదిలీలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఇదిలా ఉంటే అధికారుల బదిలీల ప్రచారం జరుగుతుండడంతో కొందరు ఈ పోస్టుల్లోకి వచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. రంగారెడ్డిజిల్లా కలెక్టర్ పోస్టు కోసం ముగ్గురు గట్టిగానే పైరవీ చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇందులో పొరుగు జిల్లాకు చెందిన కలెక్టర్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఒకవేళ ఇక్కడ వీలుకాకుంటే మేడ్చల్‌లో అవకాశం ఇవ్వాలని ఆయన కోరుతున్నట్లు సమాచారం. అలాగే మరో మహిళా అధికారి పేరు కూడా వినిపిస్తుంది. ఆమె తరుపున పెద్ద ఎత్తున రాజకీయ లాబీయింగ్ నడుస్తోంది. ఇదిలా ఉంటే అనేక మండలాల్లో కొత్త తహసీల్దార్లు వచ్చే అవకాశాలు ఉన్నాయి. గతంలో ఇక్కడ పనిచేస్తూ ఎన్నికల విధుల్లో భాగంగా బదిలీ అయిన కొందరు తహసీల్దార్లు తిరిగి ఇక్కడకు వచ్చి శివార్లలో పోస్టింగ్‌లు పొందేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

ఎడతెరపి లేకుండా..

వికారాబాద్ జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షం

తాండూరులో కూలిన ఇంటి పైకప్పు.. వ్యక్తికి గాయాలు

ఆంధ్రజ్యోతి, వికారాబాద్/తాండూరు/పెద్దేముల్/వికారాబాద్/ధారూరు, జూన్9: వికారాబాద్ జిల్లాలో ఆదివారం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. వికారాబాద్, పరిగి, కొడంగల్, తాండూరు ప్రాంతాల్లో వర్షం కురిసింది. వర్షం కురియడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పొలం పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచించడంతో రైతులు వ్యవసాయ పనులకు సన్నాహాలు చేసుకుంటున్నారు. జిల్లాలో ఆదివారం కురిసిన వర్షానికి అత్యధికంగా యాలాల్ మండలంలో 65.3మి.మీ. వర్షం కురిసింది. తాండూరులో 41.8 మి.మీ, పెద్దేముల్ లో 35.8మి.మీ, దోమలో 28.5 మి.మీ, బొంరాస్‌పేట్ లో 28.3మి.మీ, ధారూరులో 21.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. కోట్‌పల్లిలో 12.0మి.మీ, మర్పల్లిలో 7.5 మి.మీ, పరిగిలో 5.8మి.మీ, బంట్వారంలో 4.0 మి.మీ., వికారాబాద్ లో 3.0 మి.మీ., దుద్యాల్ లో 3.0 మి.మీ., కొడంగల్ లో 2.5 మి.మీ, దౌల్తాబాద్ లో 2.5 మి.మీ, కులకచర్ల లో 2.0 మి.మీ, నవాబ్‌పేట లో 1.3 మి.మీ, పూడూరులో 0.8మి.మీ వర్షం కురిసింది. తాండూరులో రెండు రోజులుగా భారీ వర్షాలు కురువడంతో రోడ్లన్ని చింతడిగా మారాయి. తాండూరు పట్టణంలో ఆదివారం పట్వారి వార్డులోని బిచ్చలం మల్లేష్ ఇంట్లో తాండూరు మండలం కొటబాస్పల్లికి చెందిన యాదగిరి కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నాడు. వర్షానికి ఒక్కసారిగా ఇంటి పై కప్పు కూలిపోవడంతో ప్రమాదంలో యాదగిరికి తలకు, కాళ్లకు గాయాలయ్యాయి. పట్టణంలో గంట పాటు ఏకధాటిగా వర్షం కురియడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పంది. పెద్దేముల్ మండలంలో ఆదివారం జోరుగా వాన కురిసింది. ముందుగానే దుక్కులు దున్ని పొలాలు సిద్ధం చేసుకున్న రైతులు వర్షాలకు పంటవిత్తనాలు విత్తుకున్నారు. వికారాబాద్ పట్టణంలో మోస్తరు వర్షం కురిసింది. వికారాబాద్ పట్టణంతో పాటు మండలంలో ఆయా ప్రాంతాల్లో వర్షంపడడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ధారూరు మండలంలోని పలు గ్రామాల్లో మృగశిర కార్తె ప్రవేశించిన తర్వాత తొలకరి వాన కురియటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



రుద్రారంలో వర్షానికి పొలాల్లో నిలిచిన నీరు



తాండూరులో కూలిన ఇంటి పైకప్పు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాండూరు, జూన్ 9 : తాండూరు పట్టణంలో విజయ విద్యాలయ హైస్కూల్ పక్కన గల రూ.10కోట్ల విలువచేసే స్థలం అన్యాకాంత్రంపై శనివారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించారు. ప్రభుత్వ భూమి గజం స్థలం కూడా అన్యాక్రాంతం కావద్దని, వెంటనే విచారణ జరిపి చర్యలు చేపట్టాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆర్డీవోను ఆదేశించారు. ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా లొంగరాదని ఎమ్మెల్యే ఆదేశించారు. శాసనసభ ఎన్నికలకు ముందు మనోహర్‌రెడ్డి తన ప్రచారంలో భాగంగా 7వ గ్యారంటీ కింద తాండూరులో కబ్జాలు, అక్రమ వ్యాపారం నిర్వహిస్తే ఉక్కుపాదంతో అణిచి వేస్తానని చెప్పారు. అదే మాట ప్రకారం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కాగా, సోమవారం వెంటనే పంచనామా చేసి ప్రభుత్వ స్థలం అనే బోర్డు పాతిస్తామని ఆర్డీవో శ్రీనివాస్‌రావు తెలిపారు. ఇప్పటికే ఆ స్థలంపై వచ్చిన ఫిర్యాదులు, రికార్డులు పరిశీలిస్తున్నామని చెప్పారు. ఆర్డీవో కార్యాలయం ఎదుటనే ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం కావడంపై రెవెన్యూ అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. ఈ స్థలం పరిరక్షణకై బీఆర్‌ఎస్ శ్రేణుల సోమవారం ఆందోళన చేపట్టాలని నిర్ణయించారు. ఈమేరకు ఆదివారం ఆ పార్టీ శ్రేణులు సమావేశమయ్యాయి. ఇదిలా ఉంటే విజయ విద్యాలయ క్రీడాస్థలం ప్రభుత్వ భూమి అన్యాక్రాంతంపై

ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం కానివ్వద్దు

- అధికారులకు తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆదేశం
- నేడు విచారణ జరిపి బోర్డు పాతిస్తాం : ఆర్డీవో
- స్థలాన్ని రక్షించాలని కోరుతూ ఆందోళనకు సిద్ధమైన బీఆర్‌ఎస్

హైస్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ బుధవారం అత్యవసర సమావేశం అవుతోంది. మేనేజ్‌మెంట్ కమిటీలో కొందరు ఈ స్థలం కబ్జాకు యత్నించడంతో అందులో ఉన్న మరికొందరు సభ్యులు నోరు మెదపకపోవడం చర్చనీయాంశమైంది. బీఆర్‌ఎస్ నాయకులు స్థలాన్ని రక్షించాలని కోరు తూ పోరాటానికి సిద్ధమయ్యారు. కాగా, పట్టణం నడిబొడ్డులో ఉన్న రూ. 10కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతమవుతోంది. సర్వేనంబర్ 111లో గల విజయ విద్యాలయ హైస్కూల్‌కు ఆనుకొని సుమారు 2వేల గజాల భూమి ఉంది. గతంలో పాఠశాలకు ఆటస్థలం కొరకు ప్రభుత్వ ఆ భూమిని వాడుకునేందుకు ఇచ్చింది. అయితే, ఆ భూమి తమదని, హక్కుదారులమని 2015 సంవత్సరంలో విజయ విద్యాలయ హైస్కూల్ యాజమాన్యంలోని కొందరు వ్యక్తులు తెలిపారు. ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకొని ప్లాట్లుగా చేసి విక్రయించే యత్నం చేశారు. పూర్వవిద్యార్థులు, స్థానికులు ముందుకొచ్చి కోర్టును ఆశ్రయించడంతో అప్పట్లోనే హైకోర్టు పర్మినెంట్ స్టే ఇచ్చింది. ఆ తర్వాత రెవెన్యూ అధికారులు కూడా విచారణ చేసి అది ప్రభుత్వ స్థలమని తేల్చేశారు.


మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి స్వల్ప అస్వస్థత

- అపోలో ఆస్పత్రిలో చేరిక.. నిలకడగా ఆరోగ్యం


తాండూరు, జూన్ 9: తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేరారు. కాగా, జ్వరంతో బాధపడుతూ ఆస్పత్రిలో చేరానని, కార్యకర్తలు, అభిమానులెవరూ చింతించవద్దని, తన ఆరోగ్యం కుదుటపడుతోందని పేర్కొన్నారు. అయితే, తాను త్వరలో పూర్తిగా కోలుకొని తాండూరుకు వస్తానని రోహిత్‌రెడ్డి ఆస్పత్రిలో బెడ్‌పై నుంచి మాట్లాడిన ఓ వీడియో కుటుంబ సభ్యులు సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారు.















నెత్తురోడిన రహదారులు


సంగారెడ్డి జిల్లాలో జరిగిన ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

- వనపర్తి, సంగారెడ్డి, భూపాలపల్లి జిల్లాల్లో ప్రమాదాలు
- ఏడుగురి మృతి, మరో ఏడుగురికి తీవ్ర గాయాలు

పెబ్బేరు/ సదాశివపేట/ కృష్ణకాలనీ, జూన్ 9: రాష్ట్రంలో ఆదివారం రహదారులు నెత్తురోడాయి. వనపర్తి, సంగారెడ్డి, భూపాలపల్లి జిల్లాల్లో జరిగిన మూడు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు మృతి చెందగా, మరో ఏడుగురు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గుజరాత్‌కు చెందిన జైన సాధువులు విజ్ఞాన్ ప్రజ్ఞ మహరాజ్, ప్రియాంకర్ రాజ్, భగవాన్‌భాయ్, హేమల్ ప్రవీణ్‌షా, పునీత్ మహరాజ్ మత ప్రచారం నిమిత్తం కాలినడకన బయలుదేరి శనివారం రాత్రి వనపర్తి జిల్లా రంగాపురం గ్రామంలో బసచేశారు. తిరిగి ఆదివారం తెల్లవారుజామున బయలుదేరిన వారిని రంగాపురం శివారులో హైదరాబాద్ వైపు నుంచి కర్నూల్ వెళ్తున్న డీసీఎం ఢీకొట్టింది. ప్రమాదంలో భగవాన్‌భాయ్(36), హేమల్ ప్రవీణ్‌షా (32) అక్కడికక్కడే మృతి చెందగా, విజ్ఞాన్ ప్రజ్ఞ మహరాజ్, పునీత్ మహరాజ్, ప్రియాంకర్ రాజ్ తీవ్రంగా గాయపడటంతో ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పునీత్ మహరాజ్(50) మృతి చెందారు. మిగిలిన ఇద్దరినీ మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంగారెడ్డి జిల్లాలో జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మరణించగా, నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఉన్నాల్ గ్రామానికి చెందిన దంపతులు హజీ షాబాజ్ కుటుంబంతో కారులో ఆదివారం హైదరాబాద్ నుంచి బీజాపూర్‌కు బయలుదేరారు. ఈ క్రమంలో సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం నందికంది గ్రామ సమీపంలో మహారాష్ట్రకు చెందిన ఓ ఆయిల్ ట్యాంకర్ అతివేగంగా వారి కారును ఢీకొట్టింది. అదే సమయంలో జహీరాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న తమిళనాడుకు చెందిన ఓ ఆయిల్ ట్యాంకర్ కూడా బలంగా కారును ఢీకొట్టింది. ఈ ఘటనలో రెండు లారీల మధ్యన కారు ఇరుక్కుని నుజ్జునుజ్జయ్యింది. ఈ ప్రమాదంలో షాబాజ్ భార్య నస్రీన్ బేగం(35), మహారాష్ట్రలోని ముంబైకి చెందిన ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్ మృత్యుంజయ్ దూబే(45) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన హజీ షాబాజ్, అతడి కుమారులు జునైద్, అబ్దుల్లాతో పాటు, మరో లారీ డ్రైవర్‌ను ఆసుపత్రికి తరలించారు. ఘటనలో భూపాలపల్లి జిల్లాలో ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందగా, ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. భూపాలపల్లి జిల్లా కమలాపూర్‌కు చెందిన రేగళ్ల నరేశ్(38), రేగళ్ల ప్రమోద్ (24), రేగళ్ల సిద్దు పని నిమిత్తం ఒకే బైక్‌పై బయలుదేరారు. ఈ క్రమంలో మేడారం నుంచి భూపాలపల్లికి వెళ్తున్న కారు అదుపుతప్పి కమలాపూర్ వద్ద వీరి బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో ప్రమోద్ మృతి చెందగా.. సిద్దుకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

విజయవాడ-హైదరాబాద్ హైవేపై దోపిడీ

- కారులో నిద్రిస్తున్న వారిపై దుండగుల దాడి
- ఆపై రూ.3 లక్షల విలువైన ఆభరణాల చోరీ
- నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి వద్ద ఘటన

చిట్యాల రూరల్, జూన్ 9: నల్లగొండ జిల్లా చిట్యాల మండల పరిధిలోని విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున దారిదోపిడీ జరిగింది. సుదీర్ఘ ప్రయాణంతో అలసిపోయిన దంపతులు హైవే పక్కన బస్‌బే మార్గంలో కారులో విశ్రాంతి తీసుకుంటుండగా దొంగలు ఈ దారుణానికి పాల్పడ్డారు. ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా అమలాపురం మండలం తోట్లపాలెం గ్రామానికి చెందిన పంచాక్షరి-అఖిల దంపతులు. వీరికి ఏడాదిన్నర కుమారుడు దేవాంశ్ ఉన్నాడు. పంచాక్షరికి సోదరి శ్రుతి ఉంది. పంచాక్షరి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ సంస్థలో, శ్రుతి మరో సంస్థలో ఉద్యోగం చేస్తున్నారు. శనివారం తోట్లపాలెం నుంచి పంచాక్షరి-అఖిల దంపతులు, వారి కుమారుడు దేవాంశ్, శ్రుతి కలిసి కారులో శనివారం హైదరాబాద్‌కు బయలుదేరారు. విజయవాడ-హైదరాబాద్ హైవేలోని నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తికి వచ్చేసరికి కారు నడుపుతున్న పంచాక్షరి అలసిపోయాడు. నిద్ర వస్తుండటంతో ఆదివారం వేకువజామున 2.30 గంటలకు కారును సర్వీస్ రోడ్డులోని బస్‌బేలో ఓ ట్రాలీ వెనుక వాహనాన్ని నిలిపాడు. కార్ డోర్‌లాక్ వేసి లోపల నిద్రించారు. సుమారు 3.45 గంటల ప్రాంతంలో ఇద్దరు దొంగలు ముఖం కనబడకుండా వస్త్రాలు కట్టుకుని పెద్దబండరాయితో కారు ముందుభాగంలోని కుడి, ఎడమవైపు అద్దాలను ధ్వంసం చేశారు. ముందుసీట్లలో నిద్రిస్తున్న పంచాక్షరిని, శ్రుతిని కారులోంచి బయటకు లాగి రాళ్లతో దాడి చేసి గాయపరిచారు. పంచాక్షరి వేలికి ఉన్న 10 గ్రాముల బంగారు ఉంగరం, శ్రుతి మెడలోని 10 గ్రాముల బంగారు గొలుసు, అఖిల మెడలోని 3 తులాల బంగారు పుస్తెల తాడును లాక్కొని సమీపంలోని తోటలోకి పారిపోయారు. దుండగుల దాడిలో గాయపడిన పంచాక్షరి, శ్రుతిలను గమనించిన ఓ వ్యాన్ డ్రైవర్ తన వాహనాన్ని ఆపి.. వారిని చౌటుప్పల్‌లోని ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తీసుకెళ్లాడు. కాగా, దోపిడీ జరిగిన ప్రాంతాన్ని నల్లగొండ ఎస్పీ చందనాదీప్తి ఆదివారం పరిశీలించారు.

అమరావతిలో మొదలైన పనులు

200 పొక్లెయిన్లతో జంగిల్ క్లియరెన్స్.. పిచ్చి మొక్కలు తొలగింపు

- రహదారుల బాగు పనులు షురూ
- ఆగిపోయిన నిర్మాణాలు ప్రారంభం
- రాజధానిలో సీఎస్ సుడిగాలి పర్యటన


రాజధాని అమరావతిలో పర్యటించిన ఏపీ సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్

తుళ్లూరు, జూన్ 9: గత ఐదేళ్లుగా తీవ్ర నిర్లక్ష్యానికి గురైన ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో మళ్లీ నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు అమరావతిలో నిలిచిపోయిన వివిధ భవన నిర్మాణ పనులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదివారం పరిశీలించారు. రాజధాని ప్రాంతంలో సుడిగాలి పర్యటన నిర్వహించారు. ముందుగా రాజధాని ప్రాంతానికి గతంలో భూమి పూజ జరిగిన ఉద్ధండరాయునిపాలెంలోని సీఆర్‌డీఏ ప్రాజెక్టు స్థలాన్ని సందర్శించారు. రాయపూడి రెవెన్యూలో నిర్మాణం పూర్తికావచ్చిన సీఆర్డీఏ రీజినల్ కార్యాలయాన్ని, అఖిల భారత సర్వీసు అధికారుల నివాసం సముదాయ భవనాలను, ఎమ్మెల్యేల క్వార్టర్లు, ఏపీ ఎన్జీవో నివాస భవనాల సముదాయాలను.. హైకోర్టు తదితర ప్రాంతాలను సీఎస్ పరిశీలించారు. శాశ్వత సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు భవనాల ఫౌండేషన్ వరకు వచ్చి ఆగిపోయిన ప్రాంతాల్లో పర్యటించారు. రాజధాని ప్రాంతం చిట్టడవిలా మారి ఉండడంతో తొలుత పెద్దఎత్తున జంగిల్ క్లియరెన్స్ పనులకు ఆదేశించారు. 200 పొక్లెయిన్లు చిట్టడవిగా ఉన్న ప్రాంతాలను శుభ్రం చేసే పనిలో నిమగ్నమయ్యాయి. పిచ్చిమొక్కలు తొలగిస్తున్నారు. రోడ్లు బాగు చేయడంతోపాటు గతంలో జరిగిన నిర్మాణాల వద్ద మళ్లీ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా, జంగిల్ క్లియరెన్స్ పనులు వెంటనే పూర్తిచేయాలని సీఎస్ నీరబ్ కుమార్ సూచించారు. రాజధానిలో అన్నిచోట్లా వీధి లైట్లు వెలగాలని సీఆర్డీయే అధికారులను ఆదేశించారు. ఈ నెల 12న సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో సీఎస్ అమరావతి పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. సీఎస్‌తో పాటు సీఆర్డీఏ కమిషనర్ వివేక్, అదనపు కమిషనర్, సీఆర్డీఏ ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఉన్నారు. ఈ సందర్భంగా సీఎస్ విలేకరులతో మాట్లాడారు. రాజధాని ప్రాంతంలో యుద్ధప్రాతిపదికన పనులు చేయడానికి 25 ప్రదేశాలను గుర్తించామని చెప్పారు. రాజధాని రైతుల వార్షిక కౌలును త్వరలోనే అందజేస్తామని చెప్పారు. రాజధానిలో చంద్రబాబు అప్పగించిన పనులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని, రోడ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. రైతుల ప్లాట్లలో అభివృద్ధి పనులు ముమ్మరం చేస్తామని ప్రకటించారు. రేయింబవళ్లు జేసీబీ యంత్రాలు జంగిల్ క్లియరెన్స్ పనులలో నిమగ్నమయ్యాయని, ఇప్పటికే 80 యంత్రాలు పనులు చేస్తున్నాయని తెలిపారు. నిర్మాణంలో వినియోగించి తుప్పుపట్టిన ఇనుము విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించి తగిన చర్యలు తీసుకుంటామని సీఎస్ పేర్కొన్నారు.

చకచకా పనులు

- చంద్రబాబు ప్రమాణ స్వీకార ఏర్పాట్లు పరిశీలించిన సీఎస్, డీజీపీ

గన్నవరం, జూన్ 9: ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారానికి ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. ఈ నెల 12వ తేదీన కృష్ణాజిల్లా గన్నవరం మండలం కేసరపల్లిలో నిర్వహించే ప్రమాణ స్వీకార కార్యక్రమం కోసం 17 ఎకరాల విస్తీర్ణంలో సీనియర్ అధికారులు, టీడీపీ నేతల పర్యవేక్షణలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పనులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) నీరబ్ కుమార్ ప్రసాద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తదితరులు ఆదివారం పరిశీలించారు. 60 మంది కూర్చునే విధంగా 80 అడుగుల వెడల్పు, 60 అడుగుల పొడవు, 8 అడుగల ఎత్తులో స్టేజీని నిర్మిస్తున్నారు. వీవీఐపీలు, వీఐపీలు, ప్రజల కోసం 800 అడుగుల పొడవు, 420 అడుగుల వెడల్పు ఉన్న జర్మన్ హ్యాంగర్స్ ఏర్పాటు చేస్తున్నారు. ప్రధాని మోదీతోపాటు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఇతర ప్రముఖులు వస్తుండటంతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో బాలింత మృతి!

- వైద్యుల నిర్లక్ష్యం వల్లేనని ఆందోళన
- రూ.8 లక్షల పరిహారంతో రాజీ!

గద్వాల క్రైం, జూన్ 9: కాన్పు కోసం వచ్చిన ఓ గర్భిణి అనుమానాస్పద స్థితిలో ఆస్పత్రిలో చనిపోయింది. అయితే, డాక్టర్ల నిర్లక్ష్యం వల్లే ఆమె చనిపోయిందని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. బాధిత కుటుంబం తెలిపిన వివరాల ప్రకారం.. జోగుళాంబ గద్వాల జిల్లా గద్వాల మండలం కొండపల్లి గ్రామానికి చెందిన శివలీల(19)కు గత ఏడాది అదే మండలంలోని కుర్వపల్లికి చెందిన రాజుతో వివాహమైంది. నిండు చూలాలు అయిన శివలీలను ఈనెల 5న కాన్పు కోసం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. గర్భంలోని బిడ్డ హృదయస్పందన సక్రమంగా లేదని, వెంటనే సిజేరియన్ చేయాలని వైద్యులు సూచించారు. మరుసటి రోజు సిజేరియన్ చేయగా శివలీలకు మగ శిశువు జన్మించాడు. అయితే ప్రసవం అయిన వెంటనే బాలింత కోమాలోకి వెళ్లింది. దాంతో ఆమెను ఆస్పత్రి సిబ్బంది కర్నూల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. శనివారం అర్ధరాత్రి బాలింత మృతి చెందిందని కర్నూల్ ఆస్పత్రి వైద్యులు తెలిపారు. అయితే శివలీల అంతకుముందే చనిపోయిందని, అయినా వైద్యులు దాచిపెట్టారని ఆమె బంధువులు ఆరోపించారు. వైద్యుల నిర్లక్ష్యమే శివలీల చనిపోయిందని గద్వాలలోని ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. అయితే కుర్వపల్లికి చెందిన ఓ నాయకుడు బాధిత కుటుంబానికి రూ.8లక్షల పరిహారం ఇచ్చేలా మాట్లాడి పంచాయితీ తెంచినట్లు తెలిసింది.

జూరాలకు 3,830 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అమరచింత, జూన్ 9: జోగులాంబ గద్వాల, వనపర్తి జిల్లాల పరిధిలోని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీగా వరద వచ్చి చేరుతోంది. ఆదివారం జూరాల ప్రాజెక్టుకు 3,830 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. జూరాల ప్రాజెక్టులో గత వారం 3.744 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ప్రస్తుతం నీటి నిల్వ 4.618 టీఎంసీలకు చేరింది. ఎగువన భారీ వర్షాలు కురుస్తుండటంతో రెండు రోజులుగా జూరాలకు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో ఎక్కువగా ఉంటోంది. ప్రాజెక్టు బ్యాక్ వాటర్ నుంచి సత్యసాయి పంప్ హౌస్‌ల ద్వారా సాగునీటి సరఫరా, ఇతర అవసరాలకు 149 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.

సారీ తమ్ముడు చచ్చిపోతున్నా..

- భార్య వివాహేతర సంబంధం
- మనోవేదనతో భర్త ఆత్మహత్య
- చనిపోయే ముందు సెల్ఫీ వీడియో


రంజిత్(ఫైల్)

హుజూర్‌నగర్, జూన్ 9: "అరె తమ్ముడు, నా పిల్లలను మంచిగా చూసుకోరా. చెల్లి స్వప్న.. నేను చచ్చిపోతున్నా! మన కుటుంబాల్లో ఇలాంటి వాళ్లు ఉండొద్దు. ఎంతకైనా పోరాడు, వదలొద్దు". అంటూ భార్య వ్యవహారంతో విసుగుచెందిన ఓ భర్త ఆత్మహత్యకు ముందు సెల్ఫీ వీడియోలో వెళ్లగక్కిన ఆవేదన ఇది. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తన భార్య మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకోవడం, వద్దని వారించినా వినకపోవడంతో విసుగెత్తిన భర్త బలవన్మరణానికి పాల్పడ్డాడు. హుజూర్‌నగర్‌కు చెందిన చిట్టిప్రోలు రంజిత్(35) వృత్తిరీత్యా ఫోటోగ్రాఫర్. మండలంలోని శ్రీనివాసపురం గ్రామానికి చెందిన మహిళను 14 ఏళ్ల కిందట ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. స్థానికంగా సీతారాంనగర్ కాలనీలో రంజిత్ కుటుంబం అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. తన భార్య ఒక హోటల్ యజమాని కుమారుడితో వివాహేతర సంబంధం నెరుపుతున్నట్లు రంజిత్‌కు తెలిసింది. ఈ విషయమై భార్యాభర్తల మధ్య తరచూ ఘర్షణ జరిగేది. ఈ క్రమంలో కొద్దిరోజుల క్రితం రంజిత్ భార్య ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన రంజిత్ తన పిల్లలను తీస్కోని మఠంపల్లిలోని చెల్లెలి ఇంటికి వెళ్లాడు. శుక్రవారం హుజూర్‌నగర్‌కు తిరిగొచ్చిన రంజిత్ ఇంట్లో ఉరివేసుకున్నాడు. అంతకు ముందే సెల్ఫీ వీడియోలో తన చావబోతున్నానని, అందుకు భార్య తీరు కారణమని, తన పిల్లలను బాగా చూసుకోవాలని తమ్ముడు, చెల్లెల్ని వేడుకున్నాడు. శనివారం సాయంత్రం రంజిత్ ఇంటి నుంచి దుర్వాసన వస్తుండటంతో పక్కింటి వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు. రంజిత్ తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ ముత్తయ్య తెలిపారు. కాగా రంజిత్ పెట్టుకున్న సెల్ఫీ వీడియో వాట్సాప్ స్టేటస్‌ను అతని మిత్రుడు ఆలస్యంగా గమనించడంతో ఈ వీడియో వ్యవహారం బయటకు వచ్చింది. కాగా, రంజిత్ మృతికి కారణమైన భార్య, హోటల్ యజమాని కుమారుడిని పోలీసులు ఆదివారం అరెస్ట్ చేసి విచారిస్తున్నట్లు సమాచారం. హోటల్ యజమాని కుమారుడు, రంజిత్ భార్యను కేసు నుంచి తప్పించేందుకు కొంతమంది కీలక నేతలు ప్రయత్నాలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి.

టెస్కాబ్‌లో అవిశ్వాసంపై నేటి సమావేశం రద్దు!

హైదరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు(టెస్కాబ్)లో సోమవారం నిర్వహించాల్సిన అవిశ్వాస తీర్మానంపై సమావేశం రద్దు అయ్యింది. ఇప్పటి వరకు టెస్కాబ్ ఛైర్మన్‌గా కొనసాగిన కొండూరు రవీందర్‌రావు, వైస్ ఛైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిలపై పాలకవర్గ సభ్యులు ఇటీవల అవిశ్వాస తీర్మానం పెడుతూ నోటీసు ఇచ్చిన విషయం విదితమే. అయితే అవిశ్వాసాన్ని ఎదుర్కోవటం ఇష్టం లేని రవీందర్‌రావు, మహేందర్‌రెడ్డి ఇటీవల తమ ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ పదవులకు రాజీనామా చేశారు. దీంతో అవిశ్వాసంపై సమావేశంతో అవసరం లేకుండాపోయింది. అయితే పాలకవర్గాన్ని ఎన్నుకోవటానికి నేడో, రేపో సమావేశం కానున్నారు. మెదక్ జిల్లా డీసీసీబీ ఛైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డిని టెస్కాబ్ ఛైర్మన్‌గా చేయటానికి ముఖ్యమంత్రి, మంత్రివర్గం సుముఖంగా ఉన్నట్లు సమాచారం. అయితే ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన తర్వాతే ఎన్నిక నిర్వహించనున్నారు. ఒకటి, రెండు రోజుల్లో టెస్కాబ్ పాలకవర్గ ఎన్నికలు లాంఛనంగా జరగనున్నాయి.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

- పొలంలో కరెంటు షాక్‌తో అన్నదాత మృతి

పాపన్నపేట/నార్కట్‌పల్లి, జూన్ 9: ఆర్థిక ఇబ్బందులు తాళలేక పురుగుల మందు తాగిన ఓ రైతు చికిత్స పొందుతూ మృతిచెందాడు. మెదక్ జిల్లా పాపన్నపేట మండల పరిధిలోని కొత్తపల్లిలో టప్ప మల్లేశం(38) అనే రైతు కౌలుకు వ్యవసాయం చేస్తున్నాడు. వడగళ్ల వానతో పంట దెబ్బతినడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. రుణభారం పెరిగిపోవడంతో గత నెల 30న కౌలు తీసుకున్న పొలం వద్ద పురుగు మందు తాగాడు. నిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఇక, నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం బెండల్‌పహాడ్‌కు చెందిన యానాల కృష్ణారెడ్డి (58) అనే రైతు విద్యుదాఘాతంతో పొలంలోనే ప్రాణాలు వదిలాడు. కౌలుకు తీసుకున్న పొలంలో ఉన్న బోరు మోటారుకు మరమ్మతులు చేయించి, ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు కరెంటు తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు.

'హాక్ ఐ' హ్యాకర్ అరెస్టు

- ఢిల్లీలో అదుపులోకి తీసుకున్న పోలీసులు

హైదరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పోలీసు శాఖకు చెందిన హాక్ ఐ, టీఎస్ కాప్, ఎస్ఎంఎస్ పోర్టల్ యాప్‌లను హ్యాక్ చేసి డేటా చోరీ చేసిన హ్యాకర్‌ను అరెస్టు చేసినట్లు డీజీపీ రవిగుప్తా తెలిపారు. ఈ నెల 8న ఢిల్లీలో నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హ్యాకర్ చోరీ వివరాలను databreachforum.st లో పోస్ట్ చేసి, ఆ డేటాను 150 డాలర్ల (రూ.12,529)కు అమ్మకానికి పెట్టాడని తెలిపారు. ఆసక్తి గలవారు సంప్రదించడానికి టెలిగ్రామ్ ఐడీలు కూడా అందులో ఉంచినట్లు డీజీపీ వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు అధునాతన సాంకేతికతతో ఢిల్లీలో 20ఏళ్ల జతిన్ కుమార్(యూపీకి చెందిన)ను నిందితుడిగా గుర్తించారన్నారు. అతడిని ట్రాన్సిట్ రిమాండ్‌పై హైదరాబాద్‌కు తీసుకురానున్నట్లు వివరించారు. కాగా, హాక్‌ఐ యాప్ డేటాలో మొబైల్ నంబర్, చిరునామా, ఈమెయిల్ ఐడీ వంటి సమాచారమే ఉంటుందని.. డీజీపీ తెలిపారు. వినియోగదారుల వ్యక్తిగత సమాచారం లీక్ కాలేదన్నారు.

సైబర్ బాధితులకు రూ.7.9 కోట్లు రికవరీ చేశాం

- టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్

హైదరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల చేతిలో ఆర్థికంగా మోసపోయిన బాధితులకు రూ.7.9 కోట్ల సొమ్ము రికవరీ చేసినట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీసీఎస్‌బీ) డైరెక్టర్ శిఖాగోయల్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ లీగల్ సర్వీసెస్ అథారిటీ (టీజీఎస్ఎస్ఏ), టీజీసీఎస్‌బీ సంయుక్తంగా అన్ని జిల్లాలు, పోలీస్ కమిషనరేట్ల అధికారుల సమన్వయంతో ఈనెల 8న నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్ విజయవంతమైందని ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. టీజీసీఎస్‌బీలో 4,144 కేసులు నమోదు కాగా, జాతీయ లోక్ అదాలత్‌లో 2,973 కేసుల్లో బాధితులకు రూ.7.9 కోట్ల సొమ్మును తిరిగి ఇప్పించగలిగామని వివరించారు. ఈ ఏడాది మార్చిలో నిర్వహించిన లోక్ అదాలత్‌లోనూ 803 కేసులను పరిష్కరించి సైబర్ నేరగాళ్లు కొట్టేసిన రూ.3,66,83,748ను బాధితులకు ఇప్పించినట్లు వెల్లడించారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే 1930 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

వానాకాలం మొదలైనా పెట్టుబడి సాయమేదీ?

- రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నచూపు
- విత్తనాల కొరత రాకుండా చూడటంలో విఫలం: హరీశ్‌రావు

నంగునూరు, జూన్ 9: వానాకాలం మొదలైనా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం అందించడం లేదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. విత్తనాలకు కొరత లేకుండా చూడటంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం అక్కెనపల్లిలో రైతు నాగేంద్రం సాగుచేసిన ఆయిల్ పామ్ మొదటి పంట కోత పనులు ఆదివారం చేపట్టగా.. హరీశ్‌రావు ఆ వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి మాట్లాడారు. రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందన్నారు. పంట బోనస్ హామీ బోగస్‌లా మారిందని విమర్శించారు. కేవలం సన్న వడ్లకే బోనస్ అనడం మాట తప్పడమేనన్నారు. రాష్ట్రంలో 90శాతం మంది రైతులు దొడ్డు వడ్లనే పండిస్తారన్న విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలన్నారు. అలాగే, పామాయిల్ దిగుమతిపై తొలగించిన సుంకాన్ని మళ్లీ విధించాలని హరీశ్‌రావు ఈ సందర్భంగా కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్ పామ్ రైతులను ప్రోత్సహించాలన్నారు.


ఆయిల్ పామ్ గెలను పరిశీలిస్తున్న హరీశ్‌రావు

విజయవంతమైన 2వ వారం



దేవి 70-ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్ 11.00,2.00,6.00,9.00
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND

SVC శ్రీలక్ష్మి - 11.15,2.30,6.15,9.30 | మల్లిఖార్జున 70 - కూకట్‌పల్లి 11.15,2.30,6.15,9.30 | రాజధాని డీలక్స్ - దిల్‌సుఖ్‌నగర్ 11.00,2.00,6.00,9.00
SVC సంగీత - ఆర్.సి.పురం 11.00,2.00,6.00,9.00 | శ్రీకృష్ణ 70ఎంఎం - ఉప్పల్ 11.00,2.00,6.00,9.00 | శ్రీప్రేమ 70ఎంఎం - తుక్కుగూడ 11.00,2.00,6.00,9.00

SUPER HIT నేడే చూడండి



సుదర్శన్ 35 ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,2.30,6.00,9.30
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound

ఆరాధన 70 - తార్నాక 11.00,6.00 | తాళ్లూరి 70 - ఇసిఐఎల్ 11.15,6.15 | మహాలక్ష్మి 70 - కొత్తపేట 11.15,6.15
శ్రీ లక్ష్మి క.మం. 70 ఎ/సి - అల్వాల్ 11.30,2.30,6.30,9.30 | శ్రీప్రేమ 70ఎంఎం ఎ/సి - తుక్కుగూడ 11.00,2.00,6.00,9.00 | సంతోష్ 70ఎంఎం - ఇబ్రహీంపట్నం 11.00,2.00,6.00,9.00

GLOBAL CINEMAS RELEASE

ప్రశాంతంగా గ్రూప్-1 పరీక్ష



మొయినాబాద్ రూరల్: కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్ష రాసేందుకు వెళ్తున్న అభ్యర్థులు

మొయినాబాద్ రూరల్, జూన్ 9 : గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష అదివారం ప్రశాంతంగా జరిగింది. మండల పరిధిలో వివిధ కళాశాలల్లో 9 కేంద్రాలను ఏర్పాటు చేశారు. భాస్కర ఇంజినీరింగ్(2), కేఎల్‌హెచ్, కేజీరెడ్డి(2) చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ, గ్లోబల్(2), వీజేఐటీ ఇంజినీరింగ్ కళాశాలల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 5,928 అభ్యర్థులకు 3,888మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ సందర్శించి అభ్యర్థుల బయోమెట్రిక్ వివరాలను నమోదును పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గౌతమ్‌కుమార్, చేవెళ్ల ఏసీపీ కిషన్, మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్‌రెడ్డి ఉన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి సమస్యలు రాకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

15,912 మందికి 12,350 మంది హాజరు

ఇబ్రహీంపట్నం/ఆదిభట్ల: గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ఇబ్రహీంపట్నం పరిధిలో ప్రశాంతంగా ముగిసింది. ఇబ్రహీంపట్నం పరిధిలో 20పరీక్ష కేంద్రాలు, ఆదిభట్ల పరిధిలో 5పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 15,912 మంది అభ్యర్థులకు 12,355 మంది పరీక్ష రాశారు. 25సెంటర్లలో 3,557 మంది గైర్హాజరయ్యారు. కేంద్రాల్లోకి గంట ముందుగా అనుమతించారు. ఉదయం 10:30గంటలకు పరీక్ష ఉండగా 10 గంటల వరకు మాత్రమే లోనికి అనుమతించారు. 10గంటల తరువాత నిమిషం ఆలస్యమైనా ఎవరినీ పరీక్ష కేంద్రంలోకి అనుమతించలేదు. పది తర్వాత వచ్చిన అభ్యర్థులు ఎంత ప్రాధేయపడ్డా అధికారులు అనుమతించలేదు. దీంతో కొందరు అభ్యర్థులు కంట తడి పెట్టుకుంటూ పరీక్ష రాయకుండానే వెళ్లిపోయారు.



ఇబ్రహీంపట్నంలోని పరీక్ష కేంద్రం వద్ద నంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు



ఇబ్రహీంపట్నంలో పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థులు

క్రీడల్లో గెలుపోటములను సమానంగా తీసుకోవాలి

కందుకూరు, జూన్ 9 : క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా తీసుకొని క్రీడాకారులు రాణించాలని బీఆర్ఎస్ నాయకులు పి.అశోక్‌ముదిరాజ్, తాండ్ర దేవేందర్ అన్నారు. గత వారం రోజులుగా దాసర్లపల్లిలో కొనసాగిన డీసీఎల్ క్రికెట్ టోర్నీ ఆదివారం ముగిసింది. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు నాయకులు బహుమతులను అందజేసిన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఇలాంటి పోటీల్లో ప్రతి క్రీడాకారులు పాల్గొని ప్రతిభను చాటాలన్నారు. డీసీఎల్ టోర్నిలో 8 టీమ్‌లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేత టీంకు గ్రామ మాజీ సర్పంచ్ పి.బాలమణిఅశోక్ రూ.15వేలు, షీల్డును అందజేశారు. ద్వితీయ బహుమతిని మాజీ ఉపసర్పంచ్ మంగా దేవిబాల్‌రాజ్ రూ.10వేలు, షీల్డును అందజేశారు. క్రీడా పోటీల నిర్వహణకు ఎంపీటీసీ ఇందిరదేవేందర్, గ్రామానికి చెందిన వేద పండితులు రాజుశర్మ రూ.5వేల చొప్పున అందజేశారు. కార్యక్రమంలో బాల్‌రాజు, ప్రదీప్‌రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రికెట్ టోర్నిలో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేసిన నాయకులు అశోక్‌గౌడ్, దేవేందర్

నీట్ ర్యాంకర్‌కు బీజేపీ నాయకుల సన్మానం



చప్పిడి నవ్యను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

తలకొండపల్లి, జూన్ 9 : నీట్ 2024 పరీక్షలో జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన వెంకట్రావ్‌పేటకు చెందిన చప్పిడి నవ్యకు బీజేపీ ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. చప్పిడి బాలమణిహుస్సేన్ దంపతుల కూతురు నవ్య నీట్‌లో 720 మార్కులకు 637 మార్కులు సాధించింది. నాయకులు నవ్యను పూల మాలలు, శాలువాలతో సత్కరించారు. చదువుకు పేదరికం అడ్డుకాదని నవ్య నిరూపించిందని నాయకులన్నారు. కార్యక్రమంలో నాయకులు ధనుంజయ, లక్ష్మణ్, భరత్, ఆనంద్, శివ, తిరుపతయ్య, నర్సింహ పాల్గొన్నారు.

ర్యాంక్ సాధించిన విద్యార్థినికి కాలనీ వాసుల సత్కారం



శంషాబాద్ రూరల్: ఊట్‌పల్లికి చెందిన రైతు బిడ్డ నీట్‌లో 77వ ర్యాంకు సాధించింది. తొట్ల సత్తయ్య, లలిత దంపతుల చిన్న కూతురు సౌమ్య నీట్ ఫలితాల్లో 77వ ర్యాంకు సాధించింది. ఆమె తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. సౌమ్యను కాలనీవాసులు చంద్రకుమార్, జయసింహ, మహేందర్, రాజు, బాల్‌రెడ్డి, సంజయ్‌రాజు శాలువా కప్పి సత్కరించారు. సౌమ్య ర్యాంక్ సాధించడం సంతోషంగా ఉందని తండ్రి స్నేహితులు అన్నారు.

జగన్‌కు ఎంపీ రఘునందన్‌రావు అభినందన



ఆమనగల్లు, జూన్ 9 : అమెరికాలోని వాషింగ్టన్ డిజిటల్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్న మాడ్గుల మండలం అప్పారెడ్డిపల్లికి చెందిన తెలంగాణ ప్రజారోగ్య బాధితుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయవాది ఉడుతల జగన్‌ను మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అభినందించారు. హరియాణాలో డాక్టరేట్ పొందిన జగన్ ఆదివారం ఢిల్లీలో రఘునందన్‌రావును కలవగా ఆయన సత్కరించారు. ప్రజారోగ్య బాధితుల సంఘం ద్వారా జగన్ అందిస్తున్న సేవలను ఎంపీ అభినందించారు.

ఆటా వేడుకల్లో పాలమూరు వాసుల సమావేశం



ఆటా-2024వేడుకల్లో పాలమూరు ఎన్ఆర్ఐలు, ఎమ్మెల్యేలు

కడ్తాల్, జూన్ 9 : అమెరికాలోని అట్లాంటా వేదికగా అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న 18వ ఆటా-2024 వేడుకల్లో భాగంగా రెండో రాజు ఆదివారం బిజినెస్, పొలిటికల్ అఫైర్స్ సమావేశం నిర్వహించినట్లు కడ్తాల మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి తెలిపారు. కడ్తాలకు చెందిన ఆటా ప్రతినిధి గూడూరు కిశోర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రవాస భారతీయులు పెద్దసంఖ్యలో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. పాలమూరు ఎన్ఆర్ఐ ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఉమ్మడి పాలమూరు అభివృద్ధి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కాలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించినట్లు లక్ష్మీనర్సింహారెడ్డి తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యేలు రాజేశ్‌రెడ్డి, మదుసూధన్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరైనట్లు పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ద్వారా ప్రత్యేక నిధులు సమకూర్చి విద్య, వైద్య రంగాల్లో పాలమూరును అభివృద్ధి పథంలో నడపాలని సమావేశంలో కోరినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి సోదరుడు జగదీశ్వర్‌రెడ్డి, భరత్, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అజీజ్‌నగర్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మొయినాబాద్ రూరల్/ఆమనగల్లు/యాచారం, జూన్ 9 : కలిసి చదువు కొని వేర్వేరు రంగాల్లో సిర్థపడి 20ఏండ్ల తర్వాత వారంతా కలుసుకున్నారు. చిన్న నాటి జ్ఞాపకాలను నెమరువేసుకొని సందడిగా గడిపారు. తమకు విద్యబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. మొయినాబాద్ మండలం అజీజ్ నగర్ జెడ్పీ పాఠశాల 2003-04బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం అజీజ్‌నగర్‌లోని ఓ వ్యవసాయ క్షేత్రంలో సమ్మేళనాన్ని నిర్వహించారు. 20ఏండ్ల తరువాత కలుసుకున్న పూర్వవిద్యార్థుల సమ్మేళనం సందడిగా జరిగింది. పూర్వ విద్యార్థులు అంతంగరెడ్డి నర్సింగ్‌రావు, దేవేందర్‌యాదవ్, మహేష్, శ్రీకాంత్‌చారి, సాయిబాబ, నరేష్‌యాదవ్, పెద్ది హరిబాబు, నల్ల సుధాకర్‌రెడ్డి, అరుణ్ కుమార్ పాల్గొన్నారు. ఆమనగల్లులో జెడ్పీ బాలుర పాఠశాల 1994-95 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. వెంకటనర్సింహ గార్డెన్‌లో నిర్వహించిన ఈ సమ్మేళనంలో బాల్యమిత్రులంతా పాల్గొన్నారు. స్కూల్ మిత్రులు 30 సంవత్సరాల తర్వాత కలుసుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. తమ ఉన్నతికి కారణమైన ఉపాధ్యాయులను సన్మానించారు. టెన్త్, ఇంటర్‌లలో ప్రతిభ కనబరిచిన బాల్యమిత్రుల పిల్లలను సత్కరించారు. 42సార్లు రక్తదానం చేసిన పూర్వవిద్యార్థి సిరందాస్ జగదీశ్వర్‌ను సన్మానించారు. తమ స్నేహహస్తం ఫౌండేషన్ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, హుజూర్ నగర్ సీఐ చరమంద రాజు, అధ్యక్షుడు తల్లోజు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి యాదయ్య, ఉపాధ్యక్షుడు శ్రీను, కోశాధికారి యాద య్య, వెంకటేశ్, జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆమనగల్లు మండలం పడకల్ జెడ్పీ పాఠశాల 1998-99 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు సమ్మేళనాన్ని జరుపుకున్నారు. తమ గురువులను సత్కరించారు. కార్యక్రమంలో ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఉమాకాం త్‌రెడ్డి, రమేశ్,యాకూబ్, నర్సింహ, చంద్రమౌళి, సునీత, రజిత, శేషగిరి, ఉపాధ్యాయులు ఆచారి, రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, అంబదాస్‌రావు పాల్గొన్నారు. యాచారంలో 2001-02 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. వారి గురువులు కృష్ణ, నారాయణరెడ్డి, రమేష్, చంద్రమౌళి, కృష్ణయ్య, వెంకటలక్ష్మి, సత్యం, పద్మలను సత్కరించారు. తామంతా పాఠశాల అభివృద్ధికి పాటుపడతామన్నారు. ప్రభుత్వ బడుల బలోపేతానికి ప్రతొక్కరు కృషిచేయాలని వారి గురువు ప్రస్తుత మహేశ్వరం ఏంఈవో కృష్ణయ్య పిలుపునిచ్చారు.



ఆమనగల్లు: పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో బాల్యమిత్రులు



యాచారంలో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, వారి గురువులు

అనారోగ్యంతో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు జంగారెడ్డి మృతి



మొయినాబాద్, జూన్ 9: బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బి.జంగారెడ్డి(53) అనారోగ్యంతో మృతిచెందారు. నక్కలపల్లికి చెందిన ఆయన అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సం పొందుతూ మృతిచెందారు. ఆదివారం సాయంత్రం నక్కలపల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు. బీజేపీ, ఇతర పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు జంగారెడ్డి మృతదేహానికి నివాళులు అర్పించారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటు అని బీజేపీ రాష్ట్ర నాయకుడు అంజన్‌కుమార్‌గౌడ్, ప్రకాష్ అన్నారు.

జంగారెడ్డి మృతి పార్టీకి తీరని లోటు



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

షాబాద్: బీజేపీ జిల్లా ఉపాధక్షుడు జంగారెడ్డి మృతి పార్టీకి తీరని లోటు అని బీజేపీ మండల అధ్యక్షుడు కిరణ్, బీజేవైఎం స్వచ్ఛభారత్‌సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము అన్నారు. షాబాద్‌లో ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. జంగారెడ్డి పార్టీకి, సమాజానికి ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. ఆయన మృతి పట్ల కుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీశైలం, హరీష్, మహేష్, రవిగౌడ్, ఎశైలం, రాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అంతారం మాజీ సర్పంచ్ మృతి



విఠలయ్యగౌడ్(ఫైల్)

చేవెళ్ల, జూన్ 9 : అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అంతారం మాజీ సర్పంచ్ ఎన్.విఠలయ్యగౌడ్(72) మృతి చెందారు. ఎన్.విఠలయ్యగౌడ్ సర్పంచ్‌గా ఉన్న సమయంలో గ్రామ అభివృద్ధికి నిరంతరం పని చేశారని గ్రామస్తులు అన్నారు. ఆయన కొద్ది రోజుల క్రితం అనారోగ్యం బారిన పడడంతో కుటుంబ సభ్యులు నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. ఆదివారం అంత్యక్రియలు చేశారు.

మోదీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఢిల్లీ తరలిన నాయకులు



కిషన్‌రెడ్డితో స్థానిక బీజేపీ నాయకులు

కొత్తూర్, జూన్ 9: ప్రధానిగా నరేంద్రమోదీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి స్థానిక బీజేపీ నాయకులు ఢిల్లీ వెళ్లారు. ఢిల్లీలోని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో పాటు, నూతనంగా ఎన్నికైన ఎంపీలను స్థానిక నాయకులు సన్మానించారు. కిషన్‌రెడ్డితో పాటు, ఎంపీలు ఈటల రాజేందర్, డీకే.అరుణ, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రఘునందన్‌రావులను వారి నివాసాల్లో కలిసి సన్మానించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎన్.శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి దేపల్లి అశోక్‌గౌడ్, మహబూబ్‌నగర్ పార్లమెంట్ కోకన్వీనర్ నర్సింహాగౌడ్, వంశీకృష్ణ, వెంకటేష్, రిషికేష్ ఢిల్లీ వెళ్లిన వారిలో ఉన్నారు.

'తెలంగాణలో బీజేపీ బలోపేతం'

షాద్‌నగర్ అర్బన్, జూన్ 9 : రాష్ట్రంలో బీజేపీ బలోపేతమై అధికారం దిశగా అడుగులు వేస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి వర్గంలో రెండవ సారి చోటు దక్కించుకున్న జి.కిషన్‌రెడ్డిని, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కేంద్ర మంత్రి వర్మను ఢిల్లీలో ఆదివారం కలిసి సన్మానం చేశారు. వారు ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ కేంద్ర మంత్రి వర్గంలో స్థానం పొందిన జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ల కృషితో బీజేపీ పటిష్ఠమై వచ్చే ఎన్నికల్లో అధికారం కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.

మొండిగౌరెల్లిలో బీజేపీ విజయోత్సవాలు

యాచారం, జూన్ 9 : ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ మూడో సారి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఆదివారం రాత్రి మండలంలోని మొండిగౌరెల్లిలో బీజేపీ కార్యకర్తలు, నాయకులు విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. పలువురు కార్యకర్తలు నాయకులు టపాసుల కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. పేదలను అన్ని విధాలా ఆదుకునేందుకు ప్రధానమంత్రి చొరవ తీసుకుంటారని మండల బీజేపీ నాయకులు తాండ్ర రవీందర్, మేకల యాదగిరిరెడ్డి అన్నారు. రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు బాషా ఢిల్లీలో జరిగిన ప్రమాణస్వీకారోత్సవానికి వెళ్లారు.



టపాసులు కాలుస్తున్న కార్యకర్తలు

ఆరు గ్యారంటీలపై అపోహలకు తావివ్వొద్దు



విలేకరులతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్, జూన్ 9 : కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీ అమలులో అనుమానాలు, అపోహలకు తావులేదని డీసీసీ అధికార ప్రతినిధి, ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రతీ హామీని ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. కడ్తాలలో ఆదివారం ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, డీసీసీ ప్రధాన కార్యదర్శి బిక్యానాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బిచ్యానాయక్‌లతో కలిసి విలేఖరులతో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. ఎమ్మెల్సీ, లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగియడంతో ఆమనగల్లులో గృహజ్యోతి పథకాన్ని అమలు చేస్తున్నట్టు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన విధంగా ఆగస్టు 15 నాటికి రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తారన్నారు. ప్రభుత్వం త్వరలోనే రేషన్ కార్డులు ఇస్తుందని శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

జంట హత్యలపై సమగ్ర విచారణ జరిపించాలి

- హత్యల వెనుక నయీమ్ ముఠా ఆనవాళ్లు
- హత్యల్లో రాజకీయ కోణం ఉన్నట్లు అనుమానం
- బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



హత్యకు గురైన శివగౌడ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కడ్తాల్, జూన్ 9: మండలంలోని గోవిందాయిపల్లికి చెందిన గుండెమోని శివగౌడ్, శేషగారి శివగౌడ్‌ల హత్య వెనుక నయీమ్ ముఠా ఆనవాళ్లు కన్పిస్తున్నాయని, పోలీసులు అన్ని కోణాల్లో విచారణ జరుపాలని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. హత్యలు ఎందుకు జరిగాయన్న దారిపై విచారణ చేయాలన్నారు. పార్ట్యాన్ బటర్ ఫ్లై సిటీలో ఈ నెల 5న హత్యకు గురైన గుండెమోని శివగౌడ్, శేషగారి శివగౌడ్‌ల కుటుంబాలను ప్రవీణ్‌కుమార్ ఆదివారం జడ్పీటీసీ వెంకటేశ్‌తో కలిసి పరామర్శించారు. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ చేతికొచ్చిన యువకులను హతమార్చడం బాధాకరం అన్నారు. కక్షతోనే హత్య చేసినట్లుగా తెలుస్తోందన్నారు. వాట్సాప్‌లో ఫొటోలు డిలీట్ చేశారనే హత్యలు చేశారని పోలీసులు పేర్కొంటున్నా రాజకీయ కారణాలు, కక్ష సాధింపు ఉన్నట్లు తల్లిదండ్రులు పేర్కొంటున్నారన్నారు. యువకుల హత్యల వెనుక నయీమ్ ముఠా ఉన్న ఆనవాళ్లు కన్పిస్తున్నాయన్నారు. యువకులను హతమార్చిన జల్కం రవికి బీజేపీ నేత తల్లోజు ఆచారితో సంబంధాలున్నాయని, హత్యల్లో అగ్రనాయకుల పాత్ర ఉందా? అన్న కోణంలోనూ విచారణ చేయాలన్నారు. నిందితులు బయటికొస్తే మరో ముగ్గురిని చంపుతారని గ్రామస్తులు ఆందోళలన వ్యక్తం చేస్తున్నారని, హంతకులకు యావజ్జీవ జైలు శిక్ష పడేలా చూడాలన్నారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా జడ్పీటీసీ వెంకటేశ్ రూ.5వేల చొప్పున అందజేశారు. పరామర్శించిన వారిలో వైస్ ఎంపీపీ బావండ్లపల్లి ఆనంద్, కర్కల్‌పహాడ్ ఎంపీటీసీ లచ్చిరామ్‌నాయక్, వీరయ్య, ఎల్లగౌడ్ ఉన్నారు.

ఆలయం వద్ద బోరు వేయించిన భక్తుడు

చేవెళ్ల, జూన్ 9 : ఆలయం అభివృద్ధిలో భక్తులంతా భాగస్వాములు కావాలని కావలి శ్రీనివాస్ అనే భక్తుడు కోరాడు. ఆదివారం చేవెళ్లలోని నల్లవాగు మైసమ్మ ఆలయం వద్ద కందవాడకు చెందిన శ్రీనివాస్ సొంత డబ్బుతో బోరు వేయించాడు. ఆయన మాట్లాడుతూ నల్లవాగు మైసమ్మ ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం బోరు వేయించానని అన్నారు. రెండు ఇంచ్‌ల నీరు పడిందన్నారు. ఆలయం అభివృద్ధిలో భక్తులు తమవంతు తోడ్పాటు అందించాలని ఆయన కోరారు.

తారు రోడ్డు పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే

షాద్‌నగర్, జూన్ 9: గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి చెందాలంటే రవాణా మార్గం మెరుగ్గా ఉండాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం షాద్‌నగర్‌లోని ఓల్డ్ హైవేలో వేస్తున్న తారు రోడ్డు బీటీ పనులను ఆయన ప్రాంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా షాద్‌నగర్ చౌరస్తా నుంచి 4.9కిలోమీటర్ల మేర అన్నారం జంక్షన్ వరకు నిర్మిస్తున్న రోడ్డు పనులకు ప్రభుత్వం రూ.45కోట్లు మంజూరు చేసిందన్నారు. వీలైనంత త్వరగా రోడ్డు పనులు పూర్తి చేయాలని సూచించారు. కొత్తూర్ ప్రాంతంలో అర కిలోమీటర్ వరకు నిధులు కేటాయించడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు బాబర్‌ఖాన్, జడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, కౌన్సిలర్ సర్వర్ పాషా, పార్టీ మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజ్ గౌడ్, తిరుపతిరెడ్డి, జమృత్‌ఖాన్, డీఈ రవీందర్, ఏఈ రాజశేఖర్ పాల్గొన్నారు.



షాద్‌నగర్‌లో తారురోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్పించండి



బడిబాట ర్యాలీలో పాల్గొన్న చైర్మన్ నిరంజన్‌రెడ్డి

ఆదిభట్ల, జూన్ 9: తల్లి దండ్రులు ఒక్కరు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి, ప్రభుత్వం దుస్తులు, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం ఇస్తుందనే విషయం గమనించి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని ఆదిభట్ల మున్సిపల్ ఛైర్మన్ నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆదిభట్లలో బడిబాట ర్యాలీలో ఆయన పాల్గొన్నారు.విద్యార్థులతో ఇల్లిల్లూ తిరిగి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ఉందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కోరె కళమ్మ, కో-ఆప్షన్ సభ్యుడు పల్లె గోపాల్‌గౌడ్, పాఠశాల చైర్మన్ మమత, ప్రధానోపాధ్యాయులు డాక్టర్ పరకాల, ఉపాధ్యాయులు బుచ్చయ్య, రాంమోహన్, జంగయ్య, విజయలక్ష్మి ఇందిర, బబ్లీ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

- **మాడ్గుల:** మండలంలోని పెద్దమాడ్గుల గ్రామానికి చెందిన జల్లేల రాజు కాడెద్దు ఇటీవల కరెంట్ షాక్‌తో మృతిచెందింది. దీంతో గ్రామానికి చెందిన కల్లు భూపాల్‌రెడ్డి ఆదివారం బాధితున్ని పరామర్శించి 5 వేల సాయం అందజేశారు. అలాగే బత్తుల జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సూదిని శరత్‌రెడ్డి రాజుకు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో రమేష్ యాదవ్, వెంకటయ్యయాదవ్, జక్కుల రాములు, భాస్కర్ పాల్గొన్నారు.
- **షాద్‌నగర్:** ఉపాధి హామీ పథకంలోని సమస్యల పరిష్కారానికి ఈ 15న షాద్‌నగర్ నిర్వహించే జిల్లా సదస్సును జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అంజయ్య, జంగయ్య కోరారు. ఉపాధి హామీ పథకంలో అనేక సమస్యలు ఉన్నాయని, పరిష్కారానికి భవిష్యత్తు పోరాటాల రూపకల్పనకు సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.
- **చేవెళ్ల:** పత్రికా రంగానికి రామోజీ రావు చేసిన సేవలు చిరస్మరణీయమని చేవెళ్ల ప్రెస్‌క్లబ్ సభ్యులు అన్నారు. చేవెళ్లలో రామోజీ రావు చిత్రపటానికి నివాళ్లు అర్పించారు. ఎంపీటీసీ రాములు, జర్నలిస్టులు శ్రీనివాస్‌చారి, గోపాల్, రాకేశ్, రాజశేఖర్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రవీణ్ పాల్గొన్నారు.
- **మహేశ్వరం:** మండలం తుక్కుగూడ మున్సిపాలిటీ రావిరాల పరిసరాల్లో ఉన్న నారాయణ కళాశాల విద్యార్థులు ఐఐటీలో వెయ్యిలోపు 6 ర్యాంకుల సాధించారు. మిర్యాలగూడకు చెందిన శివ 211 ర్యాంకు సాధించడంతో విద్యార్థులు, అధ్యాపకులు శివను సన్మానించారు.
- **కందుకూరు:** తమ పదో తరగతి క్లాస్‌మేట్ అనారోగ్యంతో మృతిచెందగా మిత్రులు అతడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. నేదునూరు పాఠశాలలో 1997-98 బ్యాచ్‌లో టెన్త్ చదివిని ధన్నారం గ్రామానికి చెందిన మంద శేఖర్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. అతడి క్లాస్‌మేట్స్ శేఖర్ భార్య బాలమణికి రూ.50 వేలు అందజేశారు. సాయంతో శేఖర్ కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

క్రైం కార్నర్

తాటిచెట్టుపై నుంచి పడి కార్మికుడి మృతి



మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య

మాడ్గుల, జూన్ 9: తాటి చెట్టు నుంచి జారి పడి గీత కార్మికుడు మృతిచెందిన సంఘటన మండలంలోని కొల్కులపల్లిలో చోటు చేసుకొంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఉడుతల వెంకటయ్యగౌడ్ (53) రోజు మాదిరిగానే ఆదివారం పొలం వద్ద కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కాడు. చెట్టు గీస్తుండగా మోకు జారి పడిపోయి వెంకటయ్యగౌడ్ అక్కడికక్కడే మృతిచెందాడు. అతడికి భార్య భారతమ్మ, ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. ఈ ఘటనపై తెలుసుకున్న కొల్లుపల్లి ఎంపీటీసీ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బట్టు కిషన్‌రెడ్డి సంఘటనా స్థలానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. జరిగిన ఘటనపై ఎంపీటీపీ ఎక్సైజ్ అధికారులకు తెలియజేశారు.

బస్సు ఢీకొని గుర్తుతెలియని మహిళ దుర్మరణం

నందిగామ, జూన్ 9:మండల పరిధి ఎమ్ఎస్ఎన్ పరిశ్రమ సమీపంలోని బైపాస్ రోడ్డులో బస్సు ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతిచెందిన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బెంగళూరు నుంచి హైద్రాబాద్ వెళ్తున్న కర్ణాటక ఆర్టీసీ బస్సు నందిగామ సమీపంలో బైపాస్ రోడ్డులో మహిళను ఢీకొంది. మహిళ మృతి చెందింది. మతదేహం గుర్తుపట్టలేని విధంగా ఛిద్రమైంది. ప్రమాదంపై వివరాలు తెలియాల్సి ఉందని ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు. మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మహిళ గ్రీన్ కలర్ జాకెట్, పసుపు రంగు చీర ధరించిందని, మృతురాలి ఆచూకీ ఎవర్కైనా తెలిస్తే నందిగామ పోలీసులను సంప్రదించాలని తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృత్యువాత



కేశంపేట, జూన్ 9: విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి చెందిన సంఘటన ఎక్లాస్‌ఖాన్‌పేటలో ఆదివారం చోటుచేసుకుంది. నక్క యాదయ్య తన పాడి ఆవులను మేపడానికి తీసుకెళ్లాడు. ఆవు గడ్డి మేస్తుండగా విద్యుత్ వైరు తెగి ఆవుపై పడింది. దీంతో ఆవు అక్కడికక్కడే మృతిచెందింది. ఆవు మృతికి కారణమైన విద్యుత్ శాఖ తనను ఆదుకోవాలని యాదయ్య డిమాండ్ చేశాడు. ఆవు విలువ రూ.80వేలు ఉంటుందని తెలిపాడు.

చెన్నంపల్లిలో గేదె ...

తలకొండపల్లి, జూన్ 9 : వెల్జాల పంచాయతీ పరిధి చెన్నంపల్లిలో తిరుమణి జగన్‌గౌడ్‌కు చెందిన గేదె కరెంట్ షాక్‌తో మృతిచెందింది. పొలాల వద్ద ఎల్‌టీ లైన్ తెగి పడింది. గేదె మేసుకుంటూ వెళ్లగా తీగ తగిలి మృతిచెందిందని, దీని విలువ రూ.లక్ష ఉంటుందని రైతు తెలిపారు.

కుర్మిద్దలోని ఓ ఇంట్లో చోరీ

యాచారం, జూన్ 9: ఇబ్రహీంపట్నంలో విందుకెళ్లి ఇంటికొచ్చే సరికి ఇల్లు గుల్ల అయిన ఘటన హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ పరిధి కుర్మిద్దలో చోటుచేసుకుంది. కుర్మిద్దకు చెందిన మడ్డి వెంకటయ్య కుటుంబీకులు శనివారం సాయంత్రం బ్రహీంపట్నంలోని తమ బంధువుల ఇంట్లో జరిగిన విందుకు వెళ్లారు. అర్ధరాత్రి దొంగలు ఇంట్లో ప్రవేశించి అరతులం బంగారు, 80 తులాల వెండి ఆభరణాలు, రూ.5వేల నగదు ఎత్తుకపోయినట్టు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.